# పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

'తపస్' ఆధ్వర్యంలో తహసీల్దార్లకు వినతిపత్రాలు



పరిగిలో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు



వికారాబాద్‌లో..



పెద్దేముల్‌లో..

పరిగి, అక్టోబర్ 28 : విద్యారంగంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో కృషి చేస్తున్నట్లు తపస్ పరిగి మండల అధ్యక్షుడు మధుసూదన్, ప్రధాన కార్యదర్శి సాయిబాబా అన్నారు. సోమవారం పరిగి తహసీల్దార్‌కు ఉపాధ్యాయుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే మంజూరు చేయాలని, పీఆర్సీ కమిటీ రిపోర్టును త్వరగా తీసుకొని అమలు చేయాలని అన్నారు. పెండింగ్ బిల్లులను అన్నింటినీ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో తపస్ సంఘం జిల్లా బాధ్యులు లక్ష్మణ్, చంద్రమౌళి, బుచ్చిలింగం, మండల బాధ్యులు కృష్ణ, ప్రవీణ్, చంద్రశేఖర్, కరుణాకర్, రాకేశ్, జల్లి శ్రీనివాస్, వీణ, మంజూల, అఖిల తదితరులు పాల్గొన్నారు.

**వికారాబాద్:** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు పెండింగ్ బిల్లుల చెల్లింపు, పెండింగ్ నాలుగు డీఏ లు చెల్లింపు, పీఆర్సీ అమలు వంటి సమస్యలపై రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో తీసుకున్న నాలుగు దశల ఉద్యమ కార్యా చరణలో భాగంగా సోమవారం వికారాబాద్ మండల తహసీల్దార్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తపస్ మండల అధ్యక్షుడు రాఘవేందర్ గుప్తా మాట్లాడుతూ ఐదు డీఏలు పెండింగ్‌లో ఉంటే రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఒకటి మాత్రమే ప్రకటించడం చాలా అన్యాయమన్నారు. వేతనాలపై ఆధారపడి జీవించే ఉద్యోగ ఉపాధ్యాయులకు న్యాయంగా రావలసిన డీఏ ల కోసం కూడా ఉద్యమాలు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా మిగతా పెండింగ్ డీఏ లను వెంటనే ప్రకటించాలన్నారు. పీఆర్సీ నివేదిక తెప్పించుకొని రాష్ట్రంలో రెండో పీఆర్సీని 50% ఫిట్మెంట్‌తో అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండల ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ అవసరాల కోసం దాచుకున్న జీపీఎఫ్, సరెండర్ లీవ్ మెడికల్ బిల్లులను, మార్చి-24 నుంచి రిటైర్డ్ అయిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు వారికి రావాల్సిన అన్ని రకాల బకాయిలు గ్రాట్యుటీ , సంపాదిత సెలవులను నగదు రూపంలో వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు కొత్తగడి అంజిరెడ్డి, తపస్ రాష్ట్ర బాధ్యులు జాక వెంకటేశం, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు శ్రీలత, జిల్లా ఉపాధ్యక్షులు ప్రసాద్ కుమార్, సంగమేశ్వర్, హన్మయ్య, మండల మహిళా కార్యదర్శి అనురాధ, ఉపాధ్యాయులు బస్వరాజు, అంజిరెడ్డి, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

**పెద్దేముల్:** ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాలకు న్యాయంగా రావాల్సిన డీఏ బకాయిలను, పీఆర్సీ, ఇతర పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) మండల అధ్యక్షుడు రాజేశ్, ప్రధాన కార్యదర్శి జె.సంతోష్ కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు . ఈ మేరకు సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ కె.కిషన్‌కు సంఘ సభ్యులు, ఉపాధ్యాయులతో కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి పది నెలలు గడిచినా ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాలకు ఎలాంటి ఆర్థికపరమైన ప్రయోజనం కలుగ లేదని, కమిటీల పేరుతో, రిపోర్టుల పేరుతో కాలయాపన చేస్తుందన్నారు. మార్కెట్‌లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాలకు న్యాయం రావాల్సిన నాలుగు డీఏ బకాయిలను, ఈ-కుబేర్‌లో ఉన్న పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, అదే విధంగా పీఆర్సీ కమిటీ రిపోర్టు తెప్పించుకొని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలను వచ్చే నెల 22 వరకు పరిష్కరించాలని లేని యెడల 23 న హైదరాబాద్ పట్టణంలో ధర్మాగ్రహ దీక్షను పెద్ద ఎత్తున చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనిల్, ఆనందం, వడిచర్ల సత్యం, వెంకటయ్య, జయశ్రీ, కవిత, శంకర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## వీధినాటక కళాకారులకు విరాళం



కళాకారులతో మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

దోమ, అక్టోబర్ 28: వీధి నాటకాలు ప్రాచీన సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బడెంపల్లి గ్రామంలో ప్రదర్శిస్తున్న రేణుకా ఎల్లమ్మ వీధి నాటకానికి హాజరైన ఆయన కళాకారులకు రూ.25000 విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కళాకారులను అభినందించారు. కార్యక్రమంలో మండల మాజీ జడ్పీటీసీ నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ కవితాశ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

**బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటాం**

బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటామని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం కులకచర్ల మండల పరిధిలోని గోరిగడ్డతండాలో ఈ నెల 21న కాట్రావత్ బుగ్యానాయక్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయాన్ని తెలుసుకున్న ఆయన తండాకు వెళ్లి మృతుడి కుమారుడు గణేశ్‌ను పరామర్శించి మనోధైర్యాన్నిచ్చాడు. పార్టీ అధికారంలో లేకున్నా కార్యకర్తలకు అండగా ఉంటుందని తెలిపారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలకు వెన్నంటే తాను ఉంటానని, తనకు తోచిన విధంగా సాయం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాజప్ప, బీఆర్‌ఎస్ నాయకులు పీరంపల్లి రాజు, అంగూర్, రమేశ్, బాల్య, రాములు, బాలాజీ, తేజ తదితరులు పాల్గొన్నారు

## సర్పన్‌పల్లి ప్రాజెక్టును అభివృద్ధి చేయండి



వికారాబాద్, అక్టోబర్ 28 : సర్పన్‌పల్లి ప్రాజెక్టుకు కోట్‌పల్లి ప్రాజెక్టు వలే నిధులు ఇవ్వాలని, ప్రాజెక్టుకు సరైన రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నామని సోమవారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు గొట్టిముక్కల గ్రామ యువకులు వినతి పత్రాన్ని అందజేశారు. మెయిన్ రోడ్డు నుంచి ప్రాజెక్టు వరకు సీసీ రోడ్డు వేయాలని, ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న మత్స్యశాఖ భవనాన్ని పూర్తి చేసేలా కృషి చేయాలని కోరారు. సర్పన్‌పల్లి ప్రాజెక్టును టూరిజం స్పాట్‌గా ఏర్పాటు చేయాలని, చెరువు కబ్జా కాకుండా చెరువు చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని కోరారు. చెరువు వద్ద రూం లను కట్టించాలని , చెరువు కాలువలకు మరమ్మతులు చేయాలని గ్రామ యువకులు స్పీకర్‌కు తెలియజేశారు. దానితో పాటు లీకేజ్ అవుతున్న తూమ్‌లను బాగుచేయాలని కోరారు. పూడికతీత పనులు జరిపి చెరువులో నీటి స్టోరేజ్ శాతాన్ని పెంచాలన్నారు. కార్యక్ర మంలో వెంకట్, పరశురామ్, నాగేశ్, అశోక్, రాజు ఉన్నారు.

## మాస్టర్ ప్లాన్ సర్వేలో మొదటి దశ పూర్తి



మాస్టర్ ప్లాన్ సర్వే మొదటి దశ పూర్తి కావడంతో సిబ్బందిని అభినందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

వికారాబాద్, అక్టోబర్ 28 : సర్వే ఆఫ్ ఇండియా టీమ్ ఆధ్వర్యంలో అమృత్ 2.0 కార్యక్రమంలో భాగంగా పది రోజులుగా డ్రోన్ కెమెరాల ద్వారా నడుస్తున్న వికారాబాద్ మున్సిపల్ మాస్టర్ ప్లాన్ డిజిటల్ సర్వే మొదటి దశ సోమవారంతో పూర్తయిందని మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల తెలిపారు. ఈ సందర్భంగా మాస్టర్ ప్లాన్ సర్వే ను విజయవంతంగా పూర్తి చేసిన సర్వే ఆఫ్ ఇండియా టీమ్, డీటీసీపీ టీమ్ తో పాటు మున్సిపల్ సిబ్బందిని ఆమె అభినందించారు. సర్వే రిపోర్ట్ ను ప్రభుత్వానికి పంపించి పూర్తి మాస్టర్ ప్లాన్ తయారు చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఈ రాకేశ్‌రెడ్డి, టీపీవో వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యవేక్షణ భవన నిర్మాణానికి భూమి పూజ



కొడంగల్, అక్టోబర్ 28 : రహదారులు, భవనాల శాఖ ఆధ్వర్యంలో నిర్మాణం చేపడుతున్న పర్యవేక్షణ భవనానికి సోమవారం సీఎం సోదరుడు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి భూమి పూజ చేశారు. పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకు ముందున్న సిటిజన్ క్లబ్ స్థలంలో రూ.6.8కోట్ల నిధులతో భవన నిర్మాణం చేపట్టేందుకు అధికారులు భూమి పూజ చేపట్టారు. కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి తో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## మిషన్ భగీరథ నీటినే తాగాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఈ ఆంజనేయులు

పూడూరు, అక్టోబర్ 28 : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలందరూ మిషన్ భగీరథ నీటిని తాగాలని మిషన్ భగీరథ ఎస్‌ఈ ఆంజనేయులు సూచించారు. సోమవారం పూడూరు మండల పరిధిలోని గ్రామీణ మంచినీటి సహాయకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంచినీటి పైపులైన్లను ప్రతిగ్రామానికీ ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న నీటిని తాగడంతో అందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. గ్రామీణ మంచినీటి సహాయకులు విద్యుత్, మంచినీటి పైపులైన్ మరమ్మతులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మంచినీటి ట్యాంకు నిండిన వెంటనే బ్లీచింగ్ పౌడర్ వేసి సరఫరా చేయాలని తెలిపారు. ప్రభుత్వం కోట్లాదిరూపాయలు ఖర్చు పెట్టి నీటి సరఫరా చేస్తున్న వాటిని సద్వినియోగం చేసుకోకపోవడం సరికాదని అన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 1700గ్రామాలకు మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

## ప్రజావాణికి అధికారులు డుమ్మా..





నవాబుపేట, అక్టోబర్ 28 : నవాబుపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు డుమ్మా కొట్టారు. ప్రతి సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారుల సమక్షంలో ప్రజావాణి నిర్వహించాలని కలెక్టర్ ఆదేశాలు ఉన్నాయి. ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను అందుబాటులో ఉన్న అధికారుల సమక్షంలో పరిష్కరించాల్సి ఉంటుంది. కలెక్టర్ దేశాలు బేఖాతరు చేసి ఆయా శాఖల అధికారులు ప్రజావాణికి డుమ్మా కొట్టారు. అధికారులే అందుబాటులో లేక పోతే ప్రజల సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని మండల ప్రజలు మండిపడుతున్నారు.

ప్రజావాణికి గైర్హాజరైన అధికారులపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అనురాధ, తహసీల్దార్ శ్రీలత, పశువైద్యాధికారి కనకరాణి, ఏపీవో లక్ష్మీదేవి, ఎంపీవో మాత్రం పాల్గొన్నారు.

## సీఆర్‌పీ విద్యాసాగర్‌కు ఆర్థిక సాయం



సీఆర్‌పీ అనంత విద్యాసాగర్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎంఈవో గోపాల్

పరిగి, అక్టోబర్ 28: పరిగి మండలంలో పనిచేస్తున్న సీఆర్‌పీ అనంత విద్యాసాగర్‌కు వైద్యం కోసం ఎంఆర్సీ ద్వారా రూ.45వేలు సోమవారం మండల విద్యాధికారి గోపాల్ అందజేశారు. సీఆర్‌పీ అనంత విద్యాసాగర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో చికిత్స నిమిత్తం ఈ మొత్తాన్ని అందించారు. తనకు ఆర్థిక సహాయం చేసిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఎంఆర్సీ బృందానికి సీఆర్‌పీ అనంత విద్యాసాగర్ ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఈవో గోపాల్, గడిసింగాపూర్ సీజీహెచ్‌ఎం అనంతరావు, ప్రాథ మిక పాఠశాల పరిగి(హెచ్‌డబ్ల్యూ) ప్రధానోపాధ్యాయుడు జయరాం, బసిరెడ్డిపల్లి ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్‌రెడ్డి, ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాధర్, మండల ఎంఆర్సీ బృందం మోహన్, శ్రీశైలం, సీఆర్‌పీలు చంద్రశేఖర్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

**పాఠ్య పుస్తకాలు అందజేత**

పరిగి మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సోమవారం మండల విద్యాధికారి గోపాల్ పాఠ్య పుస్తకాలు అందజేశారు. పరిగిలోని ఎంఆర్సీలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు అందజేయాలని ఎంఈవో సూచించారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



దౌల్తాబాద్, అక్టోబర్ 28: మండలంలోని బాలంపేట గ్రామంలోని కస్తూర్బాగాంధీ వసతి గృహంలో సోమవారం పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు 'విచక్షణతో కూడిన మొబైల్ వాడకం' అనే అంశంపై అలాగే ఇంటర్ విద్యార్థులకు 'డ్రగ్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు ఇవ్వనున్నట్లు ఎస్‌ఐ రవిగౌడ్ తెలిపారు. అలాగే దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసుల విధులు, చట్టాల అమలు ఆయుధాల వాడకం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

## నేడు సామాజిక తనిఖీ

దోమ, అక్టోబర్ 28: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం (ఎన్‌ఆర్ఈజీఎస్) సామాజిక తనిఖీ కార్యక్రమం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని ఎంపీడీవో మహేశ్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో జరిగిన ఉపాధిహామీ పథకం పనులను సామాజిక తనిఖీ బృందాల వారు జరిగిన పనులను తనిఖీ చేసి గ్రామ సభలు నిర్వహించి పనులకు సంబంధించిన నివేదికలను సేక రించారు. వాటికి సంబంధించిన వివరా లను మండల సామాజిక తనిఖీ కార్యక్ర మంలో గ్రామాల వారీగా నివేదించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి మండల స్థాయి అధికా రులు, గ్రామ పంచాయితీల ప్రత్యేక అధికా రులు, కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది ఆయా గ్రామాల ప్రజలు హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

## మొసలి కలకలం..

దౌల్తాబాద్,అక్టోబర్ 28: మండలంలోని బాలంపేట గ్రామంలోని పెద్ద చెరువులో సోమవారం ఉదయం మొసలి కనిపించడంతో గ్రామ రైతులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మొసలి ఆనవాళ్లు ఉన్నది వాస్తవమేనని రైతులు తెలిపారు.అటవీశాఖ అధికారులు రైతులతో మాట్లాడుతూ ఆందోళన చెందా ల్సిన అవసరం లేదని త్వరలోనే గజఈత గాళ్లతో మొసలిని పట్టుకుంటామన్నారు


నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★హైదరాబాద్ & తెలంగాణ జిల్లాల్లోని ప్రముఖ టెలికాం టవర్ కంపెనీలో పనిచేయడానికి డిప్లొమా/ITI చదివిన ఎలక్ట్రీషియన్లు కావలెను. ఫోన్: 9177333093.
NT-98842
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## ఎల్ ఐసీ ఏజెంట్ల నిరసన




వికారాబాద్, అక్టోబర్ 28 : ఎల్‌ఐసీ ఏజెంట్ల కమీషన్లలో ఆ సంస్థ కోతలు విధించడం సరికాదని లియాఫీ వ్యవస్థాపక అధ్యక్షుడు బీఎన్ చారి తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఎల్‌ఐసీ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి ఎల్‌ఐసీ ఏజెంట్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి గత 15 రోజులుగా ధర్నాలు చేస్తున్నామన్నారు. ఎల్‌ఐసీ ఉన్నత స్థానానికి చేరుకోవడంలో ఏజెంట్లు కీలకంగా వ్యవహరిస్తారని తెలిపారు. అలాంటి వారిని సంస్థ చిన్నచూపు చూస్తూ, వారికి కమీషన్లలో కోత విధించడం సరికాదన్నారు. ఇలా చేయడం వల్ల ఏజెంట్లలో నైతిక స్థైర్యం దెబ్బతింటున్నదని మండిపడ్డారు. కమీషన్లను పెంచాల్సింది పోయి తగ్గించడం అన్యాయం అన్నారు. సంస్థ తన నిర్ణయాన్ని పునఃసమీక్షించుకొని పాత కమీషన్ల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏజెంట్లు శ్రీనివాస్, మాణిక్‌రెడ్డి, సుదర్శన్ తదితరులు ఉన్నారు

## పోలీసు విధులపై అవగాహన



పరిగి: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ



కులకచర్ల పోలీస్‌స్టేషన్‌లో..

పరిగి, అక్టోబర్ 28: పోలీసుల విధుల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని పరిగి ఎస్‌ఐ సంతోష్‌కుమార్ సూచించారు. సోమవారం పరిగి పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌లో కార్యకలాపాలపై అవగాహన కల్పించారు. రిసెప్షన్, కోర్టు డ్యూటీ, స్టేషన్ రైటర్, సెక్షన్ ఇన్‌చార్జి, బీసీ, పెట్రో కార్, లాకప్, ఆయుధాల నిర్వహణ వంటి విషయాలను ఎస్‌ఐ వివరించారు. పోలీసు శాఖ పట్ల పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు ఓపెన్ హౌస్ నిర్వహించామన్నారు. పోలీసు శాఖ పట్ల మంచి దృక్పథం, స్ఫూర్తి కల్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, జడ్పీహెచ్‌ఎస్ నెం.1 పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

**కులకచర్ల:** ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉం డాలని కులకచర్ల ఎస్‌ఐ అన్వేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థులు, నాయకులకు పోలీసు వ్యవస్థ, చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు పోలీసులు నిర్వహిస్తున్న విధులు, చట్టాల గురించి తెలుసుకో వాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీసులు, ప్రజలు మమేకమై ఉంటారన్నారు. నేరాలు జరుగ కుండా ప్రతి ఒక్కరూ కృషిచేయాలని, నేరాలు జరిగినప్పుడు పోలీసులు తీసుకోవాల్సిన చర్యల గురించి నాయకులకు, విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కు అందజేత



కులకచర్ల, అక్టోబర్ 28 : చౌడాపూర్ మండల కేంద్రానికి చెందిన వెంకటేశ్‌కు రూ. 15వేలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును సోమవారం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సలీమ్, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు మాసయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎరుకలి యాదయ్య, పుట్ట యాదయ్య, హన్మంతు, యూత్ కాంగ్రెస్ మండల నాయకులు గోపాల్, మణికంత, శరత్‌కుమార్, సాయి పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి, తాండూర్/కొడంగల్ 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం :80966 77962